ప్రమాదాలకు కేరాఫ్‌గా మ్యాన్‌హోళ్లు

నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



మలక్‌పేట పోస్టాఫీస్‌కు వెళ్లే దారిలో..



మూసారంబాగ్ మెట్రో మాల్ గేట్ ఎదురుగా..



గణేష్ టెంపుల్ లైన్ స్వామి వివేకానంద స్కూల్ వద్ద..

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ మ్యాన్‌హోళ్లు చెడిపోయి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆదమరిస్తే అంతే సంగతులు. అధికారుల పర్యవేక్షణ కొరవడి అధ్వానంగా తయారయ్యాయి. పాదచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా పాడైన మ్యాన్‌హోళ్ల వద్ద కట్టెలు, రాళ్లు ఉంచారు. పాడైన మ్యాన్‌హోళ్ల రాకపోకలు కొనసాగించడానికి ఇబ్బందిగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. మూసారంబాగ్ మెట్రోమాల్ సబ్‌వేలో, మలక్‌పేట పోలీస్ స్టేషన్ సమీపంలో, సలీంనగర్ గణేష్ టెంపుల్‌కు వెళ్లే దారిలో స్వామి వివేకానంద స్కూల్ వద్ద ఈ పరిస్థితి నెలకొంది. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట సూపర్‌బజార్ నుంచి టీవీ టవర్ వరకు ఉన్న సబ్‌లో మూడు చోట్లా మ్యాన్‌హోల్స్ చెడిపోయాయి. నెలల గడుస్తున్నా వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. నిత్యం రద్దీగా ఉండే దారిలో వాటికి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది. నాణ్యతలేని కారణంగా ఇటీవల మరమ్మతులు చేపట్టిన మ్యాన్‌హోల్స్ సైతం కుంగి పోతున్నాయి. సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారుల్లో చిత్తశుద్ధి లోపించి పరిష్కారానికి నోచుకోవడం లేదు. నామమాత్రం తనిఖీలతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, వాటికి వెంటనే బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

నాగోలు: చదువుకు పేదరికం అడ్డుగా ఉండకూడదని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్త అన్నారు. బడంగ్‌పేట చెందిన పేద విద్యార్థినిలు శ్రావ్య 10 వతరగతి, వర్ష 9 తరగతి చదువుతున్నారు. విద్యార్థుల స్కూల్ ఫీజుల కోసం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్)ఆధ్వర్యంలో రూ.25,000 ఆర్థిక సహాయాన్ని నాగోలులో ఆదివారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు.



విద్యార్థుల చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త, స్వప్న దంపతులు

అభినందనలు

లింగోజిగూడ: రాష్ట్రంలో దళితుల సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎంతో కృషి చేస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.డా బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఇటీవల అందజేసిన దళిత రత్న అవార్డు గ్రహీతలైన లింగోజిగూడకు చెందిన శ్రీధర్, పీ అండ్ టీ కాలనీకి చెందిన నగేష్‌లను ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందించి సన్మానించారు.



దళిత రత్న అవార్డు గ్రహీ త శ్రీధర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

మలక్‌పేట: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అందించిన సమ్మర్ క్యాంప్ కిట్స్‌ను కార్పొరేటర్ ఆదివారం యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దబజార్, బాలదానమ్మబస్తీ, రామాలయం, మూసారంబాగ్‌కు చెందిన యువతకు క్రికెట్, ఇండోర్ గేమ్స్ కిట్స్ ఇచ్చారు.



స్పోర్ట్స్ సామగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ఐదుగురి జీవితాల్లో వెలుగులు



అవయవదానం చేసిన రాజేష్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ యువకుడు. వివరాల్లోకి వెళితే... ముషీరాబాద్ జవహర్ నగర్‌కు చెందిన పోటకారి రాజేష్ (30) ఈ నెల 12న ఇంట్లో ఆకస్మాత్తుగా కిందపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే రాజేష్‌ను ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న రాజేష్ బ్రెయిన్ డెడ్ అయినట్లు ఈ నెల15న వైద్యులు ప్రకటించారు. రాజేష్ కుటుంబసభ్యులు, తండ్రి మోసెస్, భార్య శైనీలకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. లివర్‌ను, ఒక కిడ్నిని కామినేని హాస్పిటల్స్‌కు, మరో కిడ్నిని గ్లోబల్ హాస్పిటల్‌కు, కార్నియాలను సరోజినిదేవి కంటి హాస్పిటల్‌కు అందజేశారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

హయత్‌నగర్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆదివారం కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాల నుంచి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమల్ల దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ... 2004 సెప్టెంబర్ తర్వాత ఉద్యోగాలలో చేరిన వారికి పెన్షన్ స్కీం వర్తించకుండా ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత ఎలాంటి ఆదాయం లేకుండా పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాహెర్‌అలీ, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కమలాకర్, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు అభినందనీయం



చంచల్‌గూడ జైలులో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్

చంచల్‌గూడ: స్వచ్ఛంద సంస్థలు జైళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని చంచల్‌గూడ పురుషుల జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ లయన్స్ క్లబ్, జైన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఖైదీలకు జైల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 450 మంది ఖైదీలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఖైదీలకు మందులతో పాటు కళ్ల జోళ్లు అందచేశారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రదీప్ దోషి, సెక్రటరీ కిషన్ గోలేచ, ట్రెజరర్ శ్రీ రాజేంద్ర గడియ, జైలు సూపరింటెండెంట్‌లు కాళిదాస్, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త దానం చేయడానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిర ప్రారంభ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రాంమోహన్‌గౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం లక్ష్మీప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చేవూరి శంకరయ్య, సభ్యులు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్‌కు 'అమ్మకు అక్షర నైవేద్యం' పుస్తకం అందజేత

చాంద్రాయణగుట్ట: తెలంగాణ సాహితీ చరిత్రలో మొట్టమొదటి సారిగా 'అమ్మకు అక్షర నైవేద్యం' లాంటి పుస్తకం రావడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్ రాజన్ అన్నారు. మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ప్రవీన్‌గౌడ్, అధ్యక్షుడు అరవింద్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి పూలబొకే, పుస్తకాన్ని అందజేశారు. ఇతర భాషల్లో కూడా ఈ పుస్తకాన్ని అనువదించాలని ఆమె సూచించారని అరవింద్‌గౌడ్ తెలిపారు.



పుస్తకాన్ని అందజేస్తున్న అరవింద్‌గౌడ్ తదితరులు

దొరికిన బంగారు గొలుసును పోలీసులకు అప్పగింత

హస్తినాపురం: రోడ్డుపై దొరికిన బంగారు గొలుసును పోలీసులకు అప్పజెప్పి తన నిజాయితీని చాటుకున్నారు జొమాటోలో పనిచేస్తున్న సేల్స్‌గర్ల్ అలివేలు, హోంగార్డు రత్నాకర్. వనస్థలిపురం సీఐ డి.జలేందర్ రెడ్డి తెలిపిన మేరకు.. నాగార్జున సాగర్ రహదారిపై ఉన్న సాగర్‌కాంప్లెక్స్ దగ్గర ఉన్న జీఎంఆర్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఉన్న దేవాలయం వద్ద రోడ్డుపై పడి ఉన్న సుమారు 6 గ్రాముల బంగారు గొలుసును జొమాటోలో పనిచేస్తున్న అలివేలు, హోంగార్డు రత్నాకర్ గుర్తించారు. వెంటనే పోలీసు పెట్రోమొబైల్ -2 ఇంచార్జి వేణుగోపాల్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఈ ముగ్గురూ కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ జలేందర్‌రెడ్డికి తమకు దొరికిన బంగారు గొలుసును అందజేశారు.వీరిని పోలీసులు అభినందించారు. గొలుసు పోగొట్టుకున్న వారుఆధారాలతో వచ్చి తీసుకెళ్లాలని పోలీసులు కోరారు.



దొరికిన బంగారు గొలుసును సీఐకి అందజేస్తున్న జొమాటో సేల్స్ గర్ల్ అలివేలు

సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తా

హయత్‌నగర్: డివిజన్‌లోని కట్టమైసమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కట్టమైసమ్మ కాలనీని సందర్శించారు. కాలనీలో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్ల, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వర్షాకాలం పూర్తిగా రోడ్లు బురదమయంగా మారుతున్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు.


ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

కుషాయిగూడ: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం చర్లపల్లి సిరి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు.

హ్యాపీ బర్త్‌డే పార్క్..

వనస్థలిపురంలో పార్కుకు పుట్టినరోజు వేడుకలు

వనస్థలిపురం: దేశంలో ఎక్కడా లేని విధంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పార్కులను అభివృద్ధి చేశామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం రైతుబజారు సమీపంలోని బ్యాంబూ ట్రీ పార్కు ప్రారంభమై 17 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానికులు, వాకర్స్, యోగ శిక్షకుల సమక్షంలో ఆదివారం పార్కుకి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నియోజవర్గం అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నామని, అత్యధిక నిధులతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, యోగ గురువు శ్రీనివాస్, నాయకులు సంజయ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, గంగం శివశంకర్, భావన శ్రీనివాస్, ఎం.సత్తిరెడ్డి, వేములయ్యగౌడ్, ఆనంద్‌రాజ్, ఘనపురం కృష్ణ, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

నాగోలు: న్యూనాగోలు కాలనీలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ సాయి శిరీష పాన్నూరు డిమాండ్ చేశారు. న్యూ నాగోల్‌లో ఉన్న ఎస్టీ హాస్టల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలసి ఆదివారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పహాడీషరీఫ్: క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడుతాయని మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్ అన్నారు. మామిడిపల్లి గ్రామ జూనియర్స్ క్రికెట్ లీగ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం తన వంతుగా రూ.8 వేలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మామిడిపల్లిలో యువత పెద్దఎత్తున క్రీడా కార్యాక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడలు ఆడటం ద్వారా ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లతో యువతలో ఐక్యతా భావం కూడా పెంపొందుతుందన్నారు. యువత క్రీడలు ఆడేందుకు ఆలయ ఆవరణ కూడా ఎంతో సౌకర్యవంతంగా మారిందన్నారు.

హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయండి



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

చాంద్రాయణగుట్ట: గ్రేటర్ నగరంలోని హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, వర్కింగ్ ప్రసిడెంట్ పేరోజి మహేశ్వర్ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని హిందూ శ్మశాన వాటికలు పెద్ద ఎత్తున కబ్జా బారిన పడుతున్నాయన్నారు. శ్మశాన వాటికలన్నింటినీ అభివృద్ధి చేసి బ్యాగరి కులస్తులకు ఇచ్చినట్లయితే కబ్జాకు అవకాశం లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పద్మాకర్, శ్రీనివాసారావు, జాన్, జగన్, జనార్దన్, వేముల, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అధికారం సాధ్యం

ఉప్పల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ కార్యకర్తలు, నాయకులతో ఆయన 'మాట-ముచ్చట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉప్పల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, తౌఫిక్, టీపీసీసీ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, బోరంపేట కృష్ణ, అంజిరెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 10కే రన్



చార్మినార్: ఈనెల 18న నిర్వహించే ప్రపంచ వారసత్వ దినోత్సవాలను పురస్కరించుకుని చార్మినార్ నుంచి గోల్కొండ కోట వరకు ఆదివారం 10కే రన్ జరిగింది. పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ రన్‌ను పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా జెండా ఊపి చార్మినార్ వద్ద ప్రారంభించారు. కేఎస్‌ఆర్ ఈవెంట్స్, డెక్లథ్లాన్ సంయుక్తాధ్వర్యంలో ఓమ్నీ హాస్పిటల్ ఫర్ ఆర్థోపెడిక్స్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఈ ర్యాలీని గోల్కొండ వరకు నిర్వహించింది. కోయంబత్తూర్, పూనే తదితర ప్రాంతాల నుంచి వచ్చి ర్యాలీలో పాల్గొన్న 150 మందికి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఉదయ్ ప్రకాష్ మెడల్స్ అందజేశారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు

చార్మినార్: కర్ణాటక ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించి తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటామని కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం బీదర్ సౌత్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న శైలేందర్ బెల్‌దాలే దీమా వ్యక్తం చేశారు. టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టితో కలిసి ఆయన ఆదివారం రాత్రి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ప్రజలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. భారీ మెజార్టీతో గెలిచి కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తామన్నారు.



పూజలు నిర్వహిస్తున్న శైలేందర్ బెల్‌దాలే, నాగ్‌నాథ్ మాశెట్టి తదితరులు

క్లుప్తంగా

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 11, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 45, క్యాలిఫ్లవర్ 18, క్యాబేజీ 13, క్యారెట్ 17. దొండ 23, ఆలు 19, ఉల్లి 14, గోకర 45, దోస 23, సొర 9, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 65, ఆర్వి 45, మునగ 23, చిలగడదుంప 41, బీట్‌రూట్ 15, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యాప్సికమ్ 45. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

శ్రీరమణకాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం ఎన్నిక



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ సంక్షేమ సంఘం ఫేజ్-2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సంతోష్‌కీర్తి, ఉపాధ్యక్షులుగా వి.కొండల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్‌గౌడ్, ఏ.అమర్‌నాథ్ రెడ్డి, కోశాధికారిగా కె.గురునాథ్‌రెడ్డి లను కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నైట్‌క్యాంపులు విద్యార్థులకు ఎంతో మేలు



నైట్‌క్యాంపులో సందడి చేస్తున్న విద్యార్థులు

హస్తినాపురం: పాఠశాలలో ఏర్పాటు చేసే నైట్ క్యాంపు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య అవగాహన సదస్సు లాంటిదని ఈ సదస్సు ప్రత్యక్షంగా అనుభవించి ఆనందపడే గొప్ప వేదిక అని అక్షర ఇంటర్నేషనల్ స్కూలు సీఈవో మదన్‌మోహన్‌రావు అన్నారు. హస్తినాపురంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూలు లో విద్యార్థులకు నైట్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో విద్యార్థులు సరదాగా గడుపుతారన్నారు. జగన్‌మోహన్‌రావు, ప్రిన్సిపాల్ రమణి వారణాసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నా



హయత్‌నగర్ విజయనగర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యలను ముందుండి పరిష్కరిస్తున్నానని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి విజయ్‌నగర్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి ఆదివారం పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కాలనీవాసులకు మంచినీటి సౌకర్యం కల్పించానన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చైతన్యపురి: సైన్స్ యూనివర్స్ (స్పిరిచ్యువల్) ఆధ్యాత్మిక విభాగం ధ్యాన మనో ప్రస్థానం ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంటామి, నర్సింహారెడ్డి, శ్రీకృష్ణ మాట్లాడుతూ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామన్నారు.

ఎల్‌బీనగర్: చలివేంద్రం ఏర్పాటుతో ప్రయాణికుల దాహార్తి తీర్చవచ్చని బీఎన్‌రెడ్డి డివిజన్ సచివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కుర్మారావు అన్నారు. స్థానిక కాలనీ నివాసి గద్దె విజయ్‌నేత గౌతమీ నగర్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన హాజరై ప్రారంభించారు.

సందడే..సందడి

చార్మినార్: పాతబస్తీ చార్మినార్ ఆదివారం పరిసరాలు జనంతో నిండిపోయాయి. మదీనా సర్కిల్ నుంచి చార్మినార్ వరకు ప్రజలు కాలినడకన ప్రధాన రోడ్డుపై వెళ్లారు. వాహనాలు ముందుకు వెళ్లడానికి ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. ఆదివారం కావడంతో పాతబస్తీ చార్మినార్ పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడాయి.